# టైమ్ సెన్స్ ।

ఆడదాన్ని మూల కూర్చోమని శాసించడానికెవరికీ అధికారం లేదు.

"తగులడ్డాను" అంటూ మునుపు ఆ మూడురోజులూ చిరుతిళ్ళు తెప్పించుకు తిని గోడల మీదకు ఎగబాకడం, నేలమీదపడి దొర్లడం, అదేపనిగా నావెల్సూ, కథలూ, పత్రికలూ చదువుతూ వంటరాని మగాళ్ళను కాల్చుకు తినడం ఆచారం!

డాక్టర్ల పుణ్యమా అనీ, కాలేజీ అమ్మాయిల ధర్మమా అనీ ఈ మూఢాచారం యిప్పుడిప్పుడే మాయమవుతోంది!

ఆ మాటకొస్తే ఆడాళ్ళకు "టైమ్ సెన్స్" లేదని మగపురుషులు వెక్కిరిస్తారుకాని — ఎవరు ఎప్పుడు మూలకూర్చునేది, ఎవత్తికి నెల తప్పినది మన ఆడవాళ్ళ ఠక్కున యమకరెక్టుగా చెప్పగలరు. కమింగ్ టు ది పాయింట్–ఇప్పుడంతా ఇళ్ళలో కలిపేడం ఫేషన్ కాబట్టి ఆడాళ్ళ రహస్యాలు ఆడాళ్ళకే అగమ్యగోచరంగా వుంటున్నాయి.

ఈ అమ్మమ్మల చాదస్తాలు పోతున్నాయని పీఠాధిపతులు గోల చేస్తున్నారు. ఇప్పుడు "గోవిందా" అని తిరపతికొండ ఎక్కేసి గుళ్ళోకి సైతం కాలేజి అమ్మాయిలు జొరబడి పోతున్నారట.

బాగుందా ఈ అభియోగం!

అందుకే ఆగ్రహించి ఆ "సెవెన్ హిల్స్ హి" అంతమంది జనాన్ని క్యూలో చంపించేశాడ్ట! అమ్మాయిల అపవిత్రతే కాని ఆలయాధికారుల ప్రమత్తత కారణం కాదట యీ ఘోరానికి.

ఇక హు కెన్ సేవ్ ఇండియా, దటీజ్ భారత్?

ఈ రైళ్ళు, బస్సులూ, సినిమాలూ, వేరింటి కాపురాలు వచ్చాక అమ్మమ్మల కాలంలోలా వుజ్జోగాలు చేసుకునే అమ్మాయిలు మూల కూర్చుంటామంటే కుదుర్తుందా? గవర్నమెంటు ఒప్పుకోవద్దూ—అందుకే ఆడదాన్ని మూలకూర్చోమని శాసించడానికెవరికీ అధికారం లేదు.

నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి — అన్నాడట మనువుగాడు. అంటే ముసుగేసి మూల కూర్చోపెట్టండి ఆడదాన్ని అనేగా అర్థం, స్త్రీలతో రాజకీయాలు చర్చించకూడదట—ఈ నీతులన్నీ ఒకరికొకరు తవ్వుకున్న గోతులు— ఎటర్నల్ ట్రూత్స్ కావు. మరి అలాగైతే ఇందిరా గాంధీ రాజ్యచక్రం ఎలా తిప్పుతోంది? సరోజనీదేవి గవర్నరు గిరి ఎలా చెలాయించింది? తోరుదత్తు అలాటిలాటి ఆడదా—ఎలాటి పొయిట్రీ రాసింది!

వీరంతా మూలకూర్చుంటే మనపని హుళక్కే. తల్లి—అక్క—అత్త—పిన్ని—చెల్లెలు—పెళ్ళాం—వదిన—కూతురు—మనుమరాలు ఎవరూ లేని వాడెవడో "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్నాడు కాని స్వాతంత్ర్యం ఒకరు యిచ్చే వస్తువా? ఆ నోటితోనే స్త్రీ శక్తిస్వరూపిణి అన్నారు. స్వాతంత్ర్యానికి అర్హురాలుకాని స్త్రీ శక్తిస్వరూపిణి ఎలాగైంది? ఆడదాన్ని అమ్మవారిని చేసి కూర్చోపెట్టారు మెళ్ళో నగలు దిగేసి, కాని జెమ్స్ లాటి ఆడాళ్ళున్నారు. మొల్ల రామాయణం మాటేమిటి? ఏం పొయిట్రీ రాసిందండీ మహాతల్లి — మూలకూర్చోపెట్టినా చావలి బంగారమ్మగారు రాయలే "కప్ప తల్లిపాట". ఆడదాయి శక్తిని టెంపరరీగా కూడా ఎవరూ అణచిపెట్టలేరు.

ఎంత చెర్లినూ, నైలాన్లూ కట్టి తెలుగు మీరినా తిథి వారనక్షత్రాలు, వారాలు, వర్జ్యాలు శకునాలు మంచిచెడ్డలు ఆడవాళ్ళకు తెలిసినట్లు యీ రోజుల్లో మగవాళ్ళకు తెలియవు.

తెలీకపోయినా పేకాటలో కూర్చుంటే లేవలేని మగాళ్ళు మీ ఆడవాళ్ళకు టైమ్ సెన్స్ లేదని దెప్పిపొడవడం మానరు.

నీడను గుర్తుపెట్టుకుని ఎంతోమంది ఆడాళ్ళు పొద్దు చెప్పేస్తారు. రిస్టువాచీ చూసుకుంటే కాని టైమెంతయిందో తెలీదు మగాళ్ళకు. అందులో అది మళ్ళీ స్లో_స్టడీ_ ఫాస్టు. ఈ రోజుల్లో రేడియో నిత్యజీవితంలో టైమ్ చెప్పడానికి బాగా వుపయోగపడుతోంది

"అమ్మో భక్తిరంజనై పోతోంది లేవే" అని పెళ్ళాన్ని మంచం మీంచి క్రిందకు నెట్టేస్తుంటాడు మొగుడుగారు.

"అబ్బ_భక్తిరంజనేగా, తెలుగు న్యూస్‌కి లేద్దాంలెండి. ఆదివారం" అంటూ మొగుడ్ని దగ్గరగా లాక్కుంటుందో ఇల్లాలు.

అడుగో సైగల్ పాడుతున్నాడు_ ఏడున్నరయిపోయింది. కాఫీ లేదు_పేపరు రాదు, అని శ్రీవారు చిందులు తొక్కుతూంటారు.

అబ్బే – ఇల్లా కుదరదండీ. వందేమాతరానికి ముందు లేవాలి రోజూ. కాస్త భక్తిరంజనితో టిఫిన్‌చేసి తెలుగున్యూస్ రాకుండా కాఫీ తాగేసి పేపరు చూడొచ్చు.

అబ్బ ఏం పనిమనుషులండీ_ ఇంగ్లీషు న్యూస్‌కూడా అవస్తోంది. పాచివాకిలి తుడిచి కడిగి ముగ్గేయలేదు. పిలిచినా ఎక్కడుందో రాదు. ప్రాణాలు కొరుక్కు తినేస్తున్నారు పనివాళ్ళు నాగాల్తో.

బాబ్బాబూ ? మీ గడ్డం పుచ్చుకు బ్రతిమాల్తాను. ఉదయ భారతి అయిపోయేలోగా నాకో కూర ముక్క తెచ్చి మొహాన్న కొడుదురూ. మీకు పుణ్య ముంటుంది. నిమ్మకాయలూ, పచ్చిమిరపకాయలూకూడా పట్రండి. స్టవ్ పిన్నొంటి మర్చిపోకండి. జాకెట్లకి పిన్నీసులు పెట్టుకు చస్తున్నాను. బటన్సన్నీ వూడిపోయాయి. ఓ డజన్ ప్రెస్ బటన్స్ పట్రండి, పర్సు తీసుకెళ్తే సంచి మర్చిపోతారు. సంచి తీసుకెళ్తే పర్సు మరచిపోతారు. రెండూ తీసికెళ్ళిన రోజున ఏపుస్తకాల షాపులోనో దూరి రేడియో స్టేషన్ కట్టేశాక చేతులూపుకుంటూ వస్తారు. బొత్తిగా టైమ్ సెన్స్ లేదండీ మీకు అని విసుక్కుంటూ వుంటాను.

ఓ సారి మధ్యాహ్నం కళ్ళుమూసుకు పడుకుంటే ఏం అలా వున్నావని అడిగారు మా వారు. మీరు వెళ్ళాక పంపుదగ్గర యింటెడు బట్టలూ పోగేసుకుని కూర్చుని సబ్బు పట్టించి వుతుక్కున్నాక అవన్నీ ఆరేసి ఆలస్యంగా విస్తరి ముందుకూర్చున్నా, రెండు మెతుకులు యిట్లా నోట్లో వేసుకున్నానో లేదో కార్మికుల కార్యక్రమంట. ఆ పేరు చెప్పుకుని అవాకులూ, చెవాకులూ నానా గోలా ప్రారంభించేసరికి తిన్నదికాస్తా వాంతి వెళ్ళిపోయింది. అంచేత మధ్యాహ్నం స్త్రీల కార్యక్రమానికి ముందు రేడియో త్రిప్పడం మానేశా అని చెప్పా.

రాత్రిళ్ళు—

అది సర్లెండి, తెలుగు వార్తలకు ముందు వస్తానన్న వారు యిప్పుడా రావడం? రేడియో వాళ్ళుకూడా స్టేషన్ కట్టేసి జనగణమన పాడేసి నిద్రపోతూంటే యిప్పుడు యిల్లు వెతుక్కుంటూ వస్తున్నారా? ఇదివరకు ఇంగ్లీష్ న్యూస్ అవుతూండగానన్నా వచ్చేవారు. కళ్ళు మూరుకుపోతున్నాయండీ. ఈ నిద్ర కళ్ళతో మీకు సాంబారే పోస్తున్నానో, చారే పోస్తున్నానో తెలియడంలేదు. ఐనా యిప్పుడెందుకు రావడం—ఆ వచ్చేదేదో భక్తిరంజని వేళకు ఇల్లు వెతుక్కుంటూ వస్తే సరిపోతుందిగా.

అలారం టైం పీసుని రేడియో డామినేట్ చేసింది. సినిమాలు కూడా యించు మించుగా అంతే.

చైత్రమాసంలో పురుడొచ్చింది. జ్యేష్ఠ మాసంలో అక్షరాభ్యాసం చేశాము. శ్రావణంలో పెద్దమనిషైంది. మాఘమాసంలో ముహూర్తం పెట్టించాము. ఇలా చెప్పుకోవడం పరిపాటి. కాని ఇప్పుడో—

గుణసుందరి టైములో మా మూడోదాన్ని కడుపుతోవున్నాననో, మల్లీశ్వరి ఆడుతున్న రోజుల్లో మా చెల్లెలు పెద్దమనిషయిందనీ, పాతాళ భైరవి అప్పుడు కార్యం చేశారు మా వాళ్ళు అంటూరిఫర్ చేస్తూంటారు.

క్రానలాజికల్ ఆర్డర్ అనేవారు. అదిపోయి సినిమో లాజికల్ ఆర్డరు వచ్చి పడిపోయింది. బాలరాజు టైములో నాకు పెళ్ళయింది. దేవదాసు ఆడుతుండగానేగా మావారు ఇంటర్మీడు మూడు పార్టులూ తప్పింది. లైలామజ్నూ టైముకు నేను కాపురాని కొచ్చాను. మాపూడో ఆడబడుచు కడుపుపోయి చచ్చినంత ఖాయిలా పడింది కీలుగుఱ్ఱం ఆడే రోజుల్లోనేగా. ఇలా మాట్లాడుకోడం సాధారణమయింది.

"ఏమయ్యా రంగులరాట్నం వచ్చినపుడు ప్రాణంమీద కొచ్చిం దని పట్టికెళ్ళిన రెండొందలూ మంచికుటుంబం శతదినోత్సవం చేసుకు న్నాక కూడా యిన్నేళ్ళయి యివ్వకపోతే ఎలా" అని ఎవరైనా బుకా యిస్తే మామూలుగానే మాట్లాడుతున్నారనుకుంటాం.

"ఉమ్మడికుటుంబం శతదినోత్సవంలో పర్సు కొట్టేశారయ్యా— ఆ దెబ్బ యిప్పటికితట్టుకోలేదు" అని వాపోవడాలుకూడా వింటూంటాం.

జీవితం అఖండవాహిని. ఒడ్లను ఒరుసుకుంటూ అడ్డం వచ్చిన వాటిని పెళ్ళగిస్తూ ముంచేస్తూ పోవడం దాని పని.

అంచాత ముసలమ్మలు మూలకూర్చోమని శాసించినా నేటి సత్య భామలు మూలకూర్చోరు. టైమ్ సెన్స్ బాగా తెలిసిన నేటి లేడిస్—

"పోతే మన శృంఖలములె కాని జయించడానికి ప్రపంచముంది" అని వీరాలాపాలు పలికి విజయ శంఖారావం చేస్తున్నారు.

కనపడలేదా మరో ప్రపంచపు అగ్నికిరీటపు ధగధగలు—